





శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠం, శృంగేరి.

పీఠాధిపతులు అనంతశ్రీ విభూషిత జగద్గురువ్వులు,

పరమహంస పరివ్రాజకాచార్య వర్యులు

**శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు మరియు**

**శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి వార్ల దివ్యానుగ్రహ ఆశీస్సులతో..**

# శ్రీ శారదా పీఠ వైశిష్ట్యం - గుంటూరు శాఖ కార్యక్రమములు



## శ్రీ శృంగేరి శంకరమఠం

# శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం

సంపత్‌నగర్, గుంటూరు. ఫోన్ : 0863-2356444, 8977585444

# శ్రీ శృంగేరీ శారదా పీఠము - వైశిష్ట్యము

భారతదేశమున సనాతన వైదిక ధర్మము పూర్తిగా క్షీణించిపోవు సమయమున కైలాసవాసియైన పరమేశ్వరుడు కేరళ రాజ్యమందలి కాలటి క్షేత్రమున, ఆర్యాంబ శివగురు అను పుణ్యదంపతులకు క్రీ.శ.788 సం॥లో పుత్రుడుగా శంకరుడను నామముతో అవతరించెను. శంకరులు బాల్యముననే సకల వేదశాస్త్రములందు పారంగతులై ఎనిమిదవయేటనే సన్యసించి ప్రస్థాన త్రయ భాష్యములు అనేక ప్రకరణ గ్రంథములు, స్తోత్ర గ్రంథములు రచించి యావద్భారత దేశము నంతయు సంచరించి దుర్మతములను ఖండించి సనాతన ధర్మమును పునఃప్రతిష్ఠించి తత్ప్రచారమునకు నాలుగు దిక్కుల యందు నాలుగు వేదములకు ప్రతీకగా నాలుగు ఆమ్నాయ పీఠములను స్థాపించిరి.

అవి (1) దక్షిణమున శృంగేరి శారదా పీఠము, (2) తూర్పున జగన్నాథ గోవర్ధన పీఠము, (3) ఉత్తరమున బదరికాశ్రమ జ్యోతిర్మఠము మరియు (4) పశ్చిమమున ద్వారకా పీఠము. ఆ పీఠములందు తమ ప్రియ శిష్యులైన శ్రీ సురేశ్వరాచార్య, శ్రీ హస్తామలక, శ్రీ తోటక, శ్రీ పద్మపాద ఆచార్యులను పీఠాధిపతులుగా నియమించి వారికి అహం బ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, తత్త్వమసి అను మహావాక్యములను ప్రసాదించిరి.

శ్రీ శంకరులు తన మఠశాసనములో ఇట్లు నిర్దేశించిరి.

**"అస్మత్పీఠే సమారూఢః పరివ్రాడుక్త లక్షణః। అహమేవేతి విజ్ఞేయః" అనియు,**
**వర్ణాశ్రమ సమాచారాః అస్మాభిర్యేప్రసాధితాః।**
**రక్షణీయాస్తఏవైతై స్స్వేస్వే భాగేయథావిధి॥**

అనగా శంకరులు స్థాపించిన 4 పీఠములందలి ఆచార్య పుంగవులను మాత్రమే శంకరాచార్యులుగా పిలువబడుతూ వారిని సాక్షాత్తూ శంకర భగవత్పాదులుగా భావించి పూజించవలెననియు ఆ 4 దిక్కులయందలి పీఠాధిపతులు శంకరులు నిర్దేశించిన వర్ణాశ్రమాచార ధర్మ వ్యవస్థను చక్కగా కాపాడుచుండవలెననియు శంకరులు తన మఠాధిపతులకు శాసనములు నిర్దేశించిరి.

శంకరులు ప్రప్రథమముగా దక్షిణామ్నాయ శారదా పీఠమును తుంగా నదీ తీరమున ప్రసిద్ధి పొందిన శృంగేరి క్షేత్రమున స్థాపించి 12 సంవత్సరములు శృంగేరీలోనే ఉండి శారదాంబను సేవిస్తూ అద్వైత ప్రచారమునకు బ్రహ్మవిద్యా ప్రచారమునకు శిష్యులను తయారు చేసిరి. తమ ప్రియశిష్యులగు సురేశ్వరాచార్యులను శారదా పీఠాధిపతిగా నియమించి తాను కైలాసము నుండి తెచ్చిన స్ఫటిక లింగమును (చంద్రమౌళీశ్వర లింగమును) మరియు రత్నగర్భగణపతిని, శ్రీచక్రమును, నిత్యపూజార్చనలకై అనుగ్రహించిరి. అవి నేటికిని గురు పరంపరగా నిత్యపూజార్చనలతో ప్రకాశించుచున్నవి.

శృంగేరి ఋష్యశృంగమహర్షి తపోభూమి, జాతివైరము లేకుండా క్రూర జంతువులయిన కప్ప, పాము పరస్పర స్నేహభావము కలిగియున్న ప్రదేశము.

శంకరాచార్య అష్టోత్తర శతనామావళిలో ఋష్యశృంగపురేశ్వరః అని వ్రాయబడియున్నది.

మాధవీయ శంకర విజయములో తెలిపినట్లు శంకరులు తన 32 సం॥ల జీవితకాలములో 12 సం॥లు శృంగేరిలోనే వుండి అద్వైత ప్రచారము బ్రహ్మవిద్యా ప్రచారములకు శిష్యులను తయారు చేయుచు గడిపిరని తెలియుచున్నది. అందువలనే శృంగేరి శారదాపీఠము చాలా విశిష్టమైనది.

శంకరాచార్యుల వారు దుర్వాసమహర్షి శాపముచే భూమిపై జన్మించిన సరస్వతీదేవిని (ఉభయ భారతి) వాదములో జయించిన పిమ్మట ఆమె శాపవిముక్తురాలై సత్యలోకము (బ్రహ్మలోకము) బయలుదేరు సమయమున, ఆవాగ్దేవిని ప్రార్థించి పొందిన వరప్రసాదముచే అద్వైతమార్గ ప్రచారమునకై శృంగేరియందు శారదాపీఠమును స్థాపించి, ఆ పీఠాధిదేవతగా సరస్వతీదేవిని ప్రతిష్ఠించి శారదాంబ అని నామకరణము చేసిరి. కావున శృంగేరి శారదా పీఠమునకు చాలా విశిష్టత కలదు.

# శ్రీ శృంగేరీ శారదా పీఠం, గుంటూరు శాఖ కార్యక్రమాలు

1961వ సంవత్సరం గుంటూరు నగరంలోని సంపత్‌నగర్‌లో శ్రీ శృంగేరీ శారదా పీఠశాఖను పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ మదనభినవ విద్యాతీర్థ మహాస్వామి కరకమలములచే ప్రారంభించబడినది. ఆ తల్లి వేంచేసియున్న ఈ శారదా మందిర ప్రాంగణంలో శ్రీ గణేషుడు, శ్రీ కుమారస్వామి, శ్రీ గంగాదేవి, శ్రీ పార్వతీదేవి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీ దత్తాత్రేయస్వామి, శ్రీ కోదండరామస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్లతో పాటు నవగ్రహాలు తమ వాహనాలతో పరివేష్టించి వున్నారు. శ్రీ శారదా పరమేశ్వరి దివ్య మంగళ విగ్రహానికి అభిముఖంగా శ్రీ ఆది శంకరులు పూజలందుకుంటున్నారు. జగద్గురు శ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి ఆదేశానుసారం సాంప్రదాయబద్ధంగా పర్వటి దినాలలో ఉత్సవాలను కూడా నిర్వహించడం జరుగుతున్నది. ఈ భారతీ తీర్థ మహాస్వామి వారి ప్రబోధాలు, ఆశయాలు, ఆదేశాలకనుగుణంగా "మానవ సేవే మాధవ సేవ"గా శారదా పీఠం గుంటూరు శాఖ బహుళ ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. పేదలు, అన్నార్తులు, అట్టడుగు వర్గాల కోసం విస్తృత ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు ఈ ప్రాంత ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి.

శ్రీ శారదా పీఠం, గుంటూరు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో కొన్ని...

## 1. శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ వేద స్మార్త శాస్త్ర పాఠశాల



ఈ పాఠశాలలో స్మార్త, వేద విద్యను విద్యార్థులకు బోధిస్తున్నారు. వీరందరికి ఉచితంగా విద్యను బోధించడంతోపాటు వసతిని, ఆహారాన్ని కూడా సమకూరుస్తున్నారు. ఈ విద్యార్థులంతా సుశిక్షితులైన

అధ్యాపకుల 24 గంటల పర్యవేక్షణలో విద్యను అధ్యయనం చేస్తున్నారు.

## 2. శ్రీ శారదా సంజీవనీ శుశృత సంచార వైద్యశాల



2000 వ సంవత్సరంలో గుంటూరు నగరంలోని మురికివాడలు మరియు సమీప ప్రాంతాలలోని గ్రామాల్లోగల నిరుపేద ప్రజానీకానికి తక్షణ వైద్య సేవలందించడం కోసం శ్రీ శారదా సంజీవనీ శుశృత సంచార వైద్యశాలను ఏర్పాటు చేయడమైనది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అంకిత భావంతో సేవలందించే వైద్య బృందం, సిబ్బందితో ఈ సంచార వైద్యశాల పేద ప్రజానీకానికి గత ఏడు సంవత్సరాల కాలంగా ఉచిత వైద్య సహాయం మరియు వైద్యుల సహకారంతో ఉచితంగా మందులను అందిస్తున్నది.

## 3. శ్రీ విద్యా భారతీ ధన్వంతరీ వైద్యశాల

శ్రీ శారదా సంజీవనీ శుశృత వైద్యశాల అందించడంలో ఈ ప్రాంత ప్రజల మన్ననలను అందుకుంటున్న తరుణంలో మరింతగా సేవలందించడం కోసం 2004వ సంవత్సరములో ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన మరొక మెడికల్ వ్యాన్ కొనుగోలు చేసి ఈ పథకానికి అందజేశారు. శ్రీ విద్యాభారతీ ధన్వంతరీ సంచార వైద్యశాల ప్రధానంగా - గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి వైద్య సేవలు అందజేయబడుతున్నాయి.

## 4. శ్రీ శారదా పరమేశ్వరీ జలధారా పథకం

గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ అందిస్తున్న మంచినీరు లభించని ప్రాంతాలలోని ప్రజానీకానికి త్రాగునీటిని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో 2002వ సంవత్సరంలో శ్రీ శారదా పరమేశ్వరి జలధార పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగినది. వీటితోపాటు అత్యవసర పరిస్థితులలో అగ్ని ప్రమాదం నివారించడంలో ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక దళానికి ఉపయోగపడటం కోసం కూడా శ్రీ శారదా పరమేశ్వరి జలధార పథకాన్ని వినియోగించడం జరుగుతున్నది.

## 5. శ్రీ శారదా నిత్యాన్నదాన పథకం




గత 5 సంవత్సరాలుగా సంపత్ నగర్ శారదా మందిర ప్రాంగణంలో అమావాస్య తిథినాడు ప్రతి నెలా పేదలకు అన్నదానాన్ని నిర్వహించడం జరుగుతున్నది. అలానే ప్రధానమైన ఉత్సవాల రోజుల్లో కూడా అన్న సంతర్పణ చేస్తున్నారు. 2007 ఫిబ్రవరి 6వ తేదీన శ్రీ శారదా నిత్యాన్నదాన పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగినది. పౌష్టికాహారాన్ని తయారు చేసి గుంటూరు నగరంలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, అనాధశరణాలయాలు అలానే దేవాలయాల ప్రాంతాలకు ప్రత్యేక వ్యాన్ ద్వారా నిరుపేదలకు ఈ ఆహారాన్ని అందించడం జరుగుతుంది. అంతే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన పరిస్థితులలో కూడా గుంటూరు శ్రీ శారదా పీఠం, బాధితులను ఆదుకోవడానికి అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తూనే వున్నారు. ప్రతిరోజు 350 మంది అన్నార్తులకు శ్రీ శారదా నిత్యాన్నదాన పథకం క్రింద భోజన సదుపాయాన్ని అందించడం జరుగుతున్నది. ఈ పథకాన్ని మరింతగా విస్తృతపరచి అధిక సంఖ్యలో పేదలకు ఆహారాన్ని అందించాలని సంకల్పించారు.

గవర్నమెంటు జనరల్ హాస్పటల్ నందు రోగులకు భోజనము హాస్పిటల్ వారే ఏర్పాటు చేయుదురు. కాని రోగులకు సహాయకులుగా వచ్చే వారు వారి భోజనము వారే ఏర్పాటు చేసుకొనవలెను. గవర్నమెంటు జనరల్ హాస్పటల్‌కు వచ్చే రోగులు ఎక్కువమంది పేదలు మరియు



గ్రామాల నుండి వచ్చేవారే. వారికి గుంటూరు నగరంలో భోజనము ఏర్పాటు చాలా వ్యయప్రయాసలతో కూడిన విషయం. గవర్నమెంటు జనరల్ హాస్పటల్‌లో రోగుల సహాయకులకు ప్రతినిత్యం 500 మందికి భోజన సదుపాయం ఏర్పాటుచేస్తున్నారు.

### 6. శ్రీ శారదా విద్యాదాన పథకం

ప్రతి ఏటా విద్యా వార్షిక సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భములో అర్హులైన ప్రతిభావంతులైన పేద విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి ఏటా వారి విద్యాభివృద్ధికోసం పారితోషికాలను, పుస్తకాలను అందించాలనే సంకల్పంతోనే శ్రీ శారదా విద్యాదాన పథకాన్ని ప్రారంభించడం జరిగింది.

### 7. వృద్ధాశ్రమము (శాంతి నిలయం)



పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారి దివ్యానుగ్రహ ఆశీస్సులతో వారి ఆదేశంతో గుంటూరు, సంపత్‌నగర్ 2/2 లో 2014లో వృద్ధాశ్రమమును శ్రీ పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు గారి ద్వారా శృంగేరీ పీఠం తరఫున నిర్మించబడినది. అందులో ప్రధానంగా ఆదరణ కోల్పోయిన వారికి, నిరాశ్రయులకు, బీదవారికి ఉచితంగా వసతి భోజనములు కల్పించబడుచున్నది.

పై కార్యక్రమములన్నియు జగద్గురు శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి పరిపూర్ణ దివ్య అనుగ్రహ ఆశీస్సులతో విజయవంతంగా నిర్వహించబడుచున్నవి.

దాతృత్వ గుణం కలిగిన వ్యక్తుల ఉదార తోడ్పాటుతో శ్రీ శారదాపీఠం గుంటూరు శాఖ ఈ పథకాలన్నిటినీ విజయవంతంగా కొనసాగించుచున్నది.

ఈ కార్యక్రమములలో భాగస్వాములు కాదలచినవారు తమ విరాళములను **శ్రీ శృంగేరీ శారదా పీఠం ఛారిటబుల్ ట్రస్ట్, శృంగేరీ** పేరిట పంపవలసినదిగా మనవి.

**సదరు విరాళములను ఆదాయపు పన్ను శాఖ వారి (80 జి) సౌలభ్యము ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపు కలదు గాన గమనించగలరు.**

శారదా పీఠంలో జరుగు కార్యక్రమాలు : వసంతనవరాత్రములు, మహారుద్రం, శంకర జయంతి, శివముక్కోటి, శరన్నవరాత్రులు, చండీయాగం, శారదా పరమేశ్వరి వార్షికోత్సవ సందర్భంలో శత చండీయాగం, కోటి కుంకుమార్చన ఇవేకాక సం॥రానికి 4 వేద సభలు జరుగును. మృగశిర, ఉత్తరఫల్గుణి, తిరునక్షత్రం, ప్రదోషకాలంలో వేదస్వస్తి.

## శృంగేరి జగద్గురువుల ఉపదేశములు

- సనాతన ధర్మాన్ని ఆచరించండి.
- ఎప్పుడూ నిజం పలకండి.
- ప్రతిరోజూ దైవప్రార్థన చేయండి.
- చేతనైనంత పరోపకారం చేయండి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఎటువంటి హాని చేయకండి ఎల్లప్పుడూ దయతో ఉండండి.
- జన్మను ఇచ్చిన తల్లిదండ్రులయెడల ప్రేమ, అభిమానములను కలిగి ఉండండి.
- గోవులను పూజించండి, గోసంరక్షణ చేయండి.

**శ్రీ శృంగేరి శంకరమఠం**

**శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం**

**సంపత్‌నగర్, గుంటూరు. ఫోన్ : 0863-2356444, 8977585444**